

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV


STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 193 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 09, జూన్ 2025 | పేజీలు 4 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# కొలువుదీరిన కొత్త మంత్రులు

హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు, పలువురు ఎంఎల్‌ఎలు

విస్తరణలో మాల, మాదిగ, బిసి వర్గాలకు ని చోటు నూతన మంత్రులు ముగ్గురూ అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టిన వారే

నేడు శాఖల కేటాయింపు?

వివేక్‌కు విద్యాశాఖ, శ్రీహరి, లక్ష్మణ్ కుమార్‌లకు బిసి, ఎస్‌సి సంక్షేమ శాఖలు అప్పగించే అవకాశం

**హైదరాబాద్, జై భీమ్ డెస్క్ :**

రాష్ట్రంలో కేబినెట్ విస్తరణ జరిగింది. ఆదివారం రాజ్‌భవన్‌లో నూత న మంత్రులుగా జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమా ర్, వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు, శా సన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక చేసింది. దీనిలో భాగంగా నే ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ), బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం కల్పించారు. కాగా ఈ సారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలకు చోటు దక్కుతుందని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం సూచించినట్లు తెలిసింది. కొత్త మంత్రులతో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రునాయక్‌ను అ ధిష్ఠానం ఎంపిక చేసింది. మంత్రి వర్గ విస్తరణలో కాంగ్రెస్ సోషల్ ఇంజనీరింగ్ ఫార్ములాను అనుసరించింది. కొత్తగా ముగ్గురికి మంత్రివర్గంలో స్థా నం కల్పించారు. ఎస్సీ మాల, ఎస్సీ మాదిగ, బీసీ ముదిరాజ్ కులం నుంచి ఒక్కొక్కరికి ఛాన్స్ ఇచ్చా రు. కాంగ్రెస్ నుంచి 15మంది ఎస్సి ఎమ్మెల్యేలు విజయం సాధించగా కొత్తగా అవకాశంఇచ్చిన వారితో కలుపుకుని నలుగురు ఉన్నారు. ఇప్పటికే మాల కమ్యూనిటీ నుంచి భట్టి విక్రమార్క, మాదిగ సామాజిక వర్గం నుంచి దామోదర రాజనరసింహ ఉండగా కొత్తగా వివేక్ వెంకటస్వామి (మాల) అ డ్లూరి లక్ష్మణ్‌కు అవకాశం కల్పించారు. కాంగ్రెస్ పార్టీ నుం చి ఏడుగురు బీసీ ఎమ్మెల్యేలు గెలవగా..

- మిగతా 2లో..

## కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ

నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు

శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రు నాయక్ నియామకం

ఈ నలుగురు నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

2



## ముగిసిన మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు

పాడె మోసిన కేటీఆర్, హరీశ్ రావు

జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ కన్నుమూత

గుండెపోటుతో ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

హాజరైన కేటీఆర్, హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు

మూడు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన గోపీనాథ్

గత కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఎమ్మెల్యే

2



## కర్నూలు జిల్లాలో.. రైతుకు దొరికిన వజ్రం!

కర్నూలు జిల్లా పత్తికొండలో తొలకరి వర్షాలకు వజ్రాల వేట

పొలంలో రైతుకు లభించిన వజ్రం.. రూ.1.5 లక్షలకు అమ్మకం


తుగ్గలి మండలం జొన్నగిరి పరిసరాల్లో జనం గాలింపు


చిన్న పిల్లలతో సహా కుటుంబాలు పొలాల్లోనే మకాం

మట్టి మెత్తబడటంతో వజ్రాల కోసం తీవ్రంగా అన్వేషణ

గతంలోనూ ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికాయన్న స్థానికులు

2





## తెలుగు రాష్ట్రాల్లో విషాదం

9 మంది జలసమాధి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ?

తొమ్మిది మంది యువకులు మృతి

తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకులు నీట మునిగి మరణం

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లాలో సరస్సులో మునిగి ముగ్గురు విద్యార్థుల దుర్మరణం

వివరాలు 2లో

జై భీమ్ POWER OF PEOPLE

# కొలువుదీరిన కొత్త మంత్రులు

మొదటి పేజీ తరువాయి




ప్రస్తుతం ఇద్దరు బీసీ మంత్రులుగా ఉన్నారు. కొత్తగా ముదిరాజ్ వర్గానికి చెం దిన వాకిటి శ్రీహరికి మంత్రి వర్గంలో చోటు కల్పించడంలో బిసిల సంఖ్య మూడుకు చేరింది. ఎస్టిల విషయానికొస్తే ఇప్పటి ఆదివాసీల సామాజిక వర్గానికి చెందిన సీతక్క మంత్రిగా కొనసాగుతున్నారు. లంబాడీల కు అవకాశం కల్పించకపోవడంతో వారిని సంతృ ప్తి పరిచే విధంగా రామచంద్రు నాయక్ కు డిప్యూటీ స్పీకర్ గా అవకాశం ఇవ్వనున్నారు. కొత్తగా మంత్రిగా విస్తరణలో రెడ్డి కమ్యూనిటీకి ఛాన్స్ ఇవ్వలేదు. ఇప్పటికే ఆ సామాజిక వర్గం నుంచి ముగ్గురు మంత్రులుగా ఉన్నారు. మంత్రివర్గంలో కొత్తగా చేరిన మంత్రులకు సోమవారం శాఖలను కేటాయించనున్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు ఏ శాఖలు కేటాయిస్తారనే చర్చ జోరందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర ఉన్న శాఖలే వీరికి కేటాయిస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. కాగా గడ్డం వివేక్ వెంకటస్వామికి విద్యాశాఖ, వాకిటి శ్రీహరికి బీసీ సంక్షేమ శాఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సాంఘీక సంక్షేమ శాఖ ఇస్తారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆదివారం సెలవు కావడంతో సోమవారం శాఖల కేటాయింపుపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. ప్రస్తుతం సీఎం దగ్గర హోంశాఖ, మున్సిపల్, విద్య, మైనారిటీ శాఖలు ఉన్నాయి. అయితే వీటిలో ఏవి ఎవరికి ఇవ్వనున్నారనే విషయం సోమవారం తేలనుంది.

## కర్నూలు జిల్లాలో రైతుకు దొరికిన వజ్రం!

**కర్నూలు జిల్లా పత్తికొండలో తొలకరి వర్షాలకు వజ్రాల వేట**
**పొలంలో రైతుకు లభించిన వజ్రం.. రూ.1.5 లక్షలకు అమ్మకం**
**తుగ్గలి మండలం జొన్నగిరి పరిసరాల్లో జనం గాలింపు**
**చిన్న పిల్లలతో సహా కుటుంబాలు పొలాల్లోనే మకాం**
**మట్టి మెత్తబడటంతో వజ్రాల కోసం తీవ్రంగా అన్వేషణ**
**గతంలోనూ ఈ ప్రాంతంలో వజ్రాలు దొరికాయన్న స్థానికులు**

**కర్నూలు, జై భీమ్ న్యూస్**

కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గంలో తొలకరి జల్లులు కురవడంతో ఓ రైతుకు అనూహ్యంగా అదృష్టం వరించింది. తన పొలంలో ఓ విలువైన వజ్రం దొరకడంతో, ఆ వార్త దావానలంలా వ్యాపించింది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కుటుంబాలతో సహా పిల్లలను వెంటబెట్టుకుని పొలాల్లో వజ్రాల కోసం వెతుకులాట ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే, సాధారణంగా తొలకరి వర్షాలు రైతులకు కాస్త ఉపశమనాన్ని ఇస్తాయి. కానీ ఈ ఏడాది, ఆ వాన చినుకులు ఊహించని సంపదను కూడా మోసుకొచ్చాయి. తుగ్గలి మండల కేంద్రం సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఓ రైతు పొలం పనులు చేసుకుంటుండగా ఈ వజ్రం బయటపడింది. తేలికపాటి వర్షం తర్వాత పొలాన్ని చదును చేస్తుండగా ఇది దొరికినట్లు సమాచారం. ఈ అదృష్టవంతుడైన రైతు ఆ వజ్రాన్ని వెంటనే స్థానిక వ్యాపారికి రూ.1.5 లక్షలకు విక్రయించాడు. ఆ ప్రాంతంలో ఆ మాత్రం రేటు పలకడం చిన్న విషయమేమీ కాదు. తుగ్గలి మండలంలోని జొన్నగిరి గ్రామం, దాని పరిసర ప్రాంతాలు గతంలోనూ అప్పుడప్పుడు వజ్రాలు దొరికాయన్న పేరుంది. తాజాగా రైతుకు వజ్రం దొరికిందన్న వార్తతో స్థానికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. వర్షానికి నేల మెత్తబడటంతో, అసాధారణంగా కనిపించే రాళ్లను గుర్తించే అవకాశం మెరుగైందని భావిస్తూ జనం పొలాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. ఓ స్థానికుడు తెలిపిన వివరాల ప్రకారం, అనేక మంది గ్రామస్థులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి పొలాల్లోనే ఎక్కువ సమయం గడుపుతున్నారు. మట్టిని జాగ్రత్తగా తవ్వుతూ ఏదైనా రాయి దొరుకుతుందేమోనని ఆశగా వెతుకుతున్నారు. “చిన్న పిల్లలు, పసికందులతో సహా ఈ అన్వేషణలో పాల్గొంటున్నారు” అని ఓ వ్యక్తి చెప్పాడు. రోజంతా పొలాల్లోనే ఉండటానికి వీలుగా ఆహారం, ఇతర సామగ్రిని కూడా వెంట తెచ్చుకుంటున్నారట. “కొందరు తల్లిదండ్రులు చిన్న పిల్లలను వాకర్లలో కూర్చోబెట్టుకుని, పెద్ద పిల్లలతో కలిసి వెతుకుతున్నారు” అని మరో స్థానికుడు వివరించాడు. ఈ భూమి లోపల రహస్య నిధులు ఉన్నాయని స్థానికులు ఎప్పటినుంచో నమ్ముతున్నారు. తాజా సంఘటన వారి నమ్మకాన్ని మరింత బలపరిచింది. అయితే, నిపుణులు మాత్రం ఈ ప్రాంతంలో గతంలో వజ్రాలు దొరికినప్పటికీ, అవి చాలా అరుదుగా, ఊహించని విధంగా లభిస్తాయని చెబుతున్నారు. “తొలకరి వర్షపు చినుకులు మంచి పంటను మాత్రమే కాదు, భూమి కింద మెరిసే ఊహించని అదృష్టాన్ని కూడా మోసుకొస్తాయనే ఆశతో ఉన్నాం” అని ఓ గ్రామస్థుడు తెలిపాడు. దీంతో గ్రామస్థులు ఓ వైపు మంచి పంట కోసం, మరోవైపు అదృష్టం కలిసొచ్చి వజ్రాలు దొరకాలని ఆశిస్తున్నారు.

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

**హైదరాబాద్ : (జై భీమ్ న్యూస్)**

నూతనంగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే వెంట టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, గడ్డం విష్ణువర్ధన్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు

**పాడె మోసిన కేటీఆర్, హరీశ్ రావు**
**జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ కన్నుమూత**
**గుండెపోటుతో ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి**
**జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు**
**హాజరైన కేటీఆర్, హరీశ్ రావు, పలువురు బీఆర్ఎస్ నాయకులు**
**మూడు రోజుల క్రితం ఆసుపత్రిలో చేరిన గోపీనాథ్**
**గత కొంతకాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న ఎమ్మెల్యే**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

బీఆర్ఎస్ పార్టీ నేత, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (62) అంత్యక్రియలు ముగిశాయి. ఆదివారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య మాగంటి అంత్యక్రియలు నిర్వహించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఆదివారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాగంటి గోపీనాథ్ అంతిమ సంస్కారాలు కన్నీటి వీడ్కోలు నడుమ జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనకు తుది నివాళులర్పించారు. అంతకుముందు జరిగిన అంతిమయాత్రలో కేటీఆర్, హరీశ్ రావు తదితరులు పాడె మోశారు. పోలీసులు మాగంటి భౌతికకాయానికి గౌరవ వందనం సమర్పించారు. గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అధికారిక లాంఛనాలను పూర్తి చేశారు. మాగంటి గోపీనాథ్ గత మూడు రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. ఈ నెల 5న ఇంట్లో ఉన్న సమయంలో ఆయనకు తీవ్రమైన గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, ఆయన కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు నిర్ధారించారు. వెంటనే సీపీఆర్ చేయడంతో గుండె స్పందించింది. అనంతరం నాడీ, రక్తపోటు సాధారణ స్థితికి రావడంతో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించారు. అయితే, మాగంటి గోపీనాథ్ గత కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో కూడా పోరాడుతున్నారు. ఈ క్రమంలో మూడు నెలల క్రితం ఆయన ఏఐజీ ఆసుపత్రిలోనే చేరి డయాలసిస్ చేయించుకున్నట్లు సమాచారం. గుండెపోటుతో మూడు రోజులుగా చికిత్స పొందుతున్నప్పటికీ, ఆయన ఆరోగ్యం విషమించడంతో ఆదివారం ఉదయం 5:45 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారని వైద్యులు తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.





## తెలుగు రాష్ట్రాల్లో విషాదం... 9 మంది జలసమాధి

**తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం తొమ్మిది మంది యువకులు మృతి**
**తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీలో ఆరుగురు యువకులు నీట మునిగి మరణం**
**ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లాలో సరస్సులో మునిగి ముగ్గురు విద్యార్థుల దుర్మరణం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లో ఆదివారం తీవ్ర విషాదకర సంఘటనలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రెండు ప్రమాదాల్లో మొత్తం తొమ్మిది మంది యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో తీరని దుఃఖం అలుముకుంది. అధికారులు ఈ వివరాలను ఆదివారం వెల్లడించారు. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి నదిపై ఉన్న మేడిగడ్డ బ్యారేజీ వద్ద శనివారం స్నానానికి వెళ్లి గల్లంతైన ఆరుగురు యువకుల మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. మృతులను మధుసూదన్ (18), పి. శివ మనోజ్ (15), రక్షిత్ (13), కర్నాల సాగర్ (16), రామ్ చరణ్ (18), పి. రాహుల్ (19)గా గుర్తించారు. వీరంతా అంబటిపల్లి, కొర్లకుంట గ్రామాలకు చెందిన ఒకే కుటుంబ బంధువులు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఎనిమిది మంది బంధువుల వివాహ విందుకు హాజరైన తర్వాత సమీపంలోని మేడిగడ్డ బ్యారేజీ వద్దకు శనివారం స్నానానికి వెళ్లారు. వీరితో పాటు పత్తి వెంకటస్వామి అనే మధ్యవయస్కుడు కూడా ఉన్నారు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతుండగా, వెంకటస్వామి, మరో వ్యక్తి సురక్షితంగా బయటపడ్డారు. కాగా, మృతుల్లో మధుసూదన్, మనోజ్.. వెంకటస్వామి కుమారులు కావడం మరింత విషాదకరం. తొలుత ఇద్దరు బాలురు నీటిలో మునిగిపోతుండగా, వారిని కాపాడే ప్రయత్నంలో మిగిలినవారు కూడా ప్రాణాలు కోల్పోయారని తెలిసింది. ఇటీవల ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా మేడిగడ్డ వద్ద గోదావరిలో నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణమే భారీస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాలు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. నిపుణులైన ఈతగాళ్లు, మూడు బోట్ల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహాదేవ్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆదివారం మరో విషాద ఘటన చోటుచేసుకుంది. డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ కేంద్రంలోని ఓ చెరువులో ఈతకు వెళ్లి ముగ్గురు పదో తరగతి విద్యార్థులు నీట మునిగి మరణించారు. మృతులను కె. సుశాంత్, జి. భాను తేజం, సాయి కిరణ్‌గా గుర్తించారు.పోలీసుల కథనం ప్రకారం, ఈ ముగ్గురు స్నేహితులు సెలవులు కావడంతో సరదాగా చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. అయితే, లోతు అంచనా వేయలేక నీట మునిగి ప్రాణాలు విడిచారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ రెండు ఘటనలతో తెలుగు రాష్ట్రాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వేసవి సెలవులు, వర్షాకాలం ఆరంభంలో నీటి వనరుల వద్దకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు.

## కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

**ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!**
**తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ**
**నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం**
**వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు**
**శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రు నాయక్ నియామకం**
**ఈ నలుగురు నేతలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, నూతన మంత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషెస్ తెలియజేశారు. నూతన మంత్రులుగా వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా, శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్)గా రామచంద్రు నాయక్ నియమితులయ్యారు. దీనిపై రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. “నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించబోతున్న వివేక్ వెంకట స్వామి గారు, అడ్లూరి లక్ష్మణ్ గారు, వాకిటి శ్రీహరి గారికి నా అభినందనలు. శాసనసభలో ఉప సభాపతి బాధ్యతలు స్వీకరించబోతున్న రామచంద్రు నాయక్ గారికి నా అభినందనలు...” అని పేర్కొన్నారు. కాగా, మంత్రివర్గంలో చాన్స్ దక్కించుకున్న ఈ ముగ్గురు కూడా తొలిసారి ఎమ్మెల్యేలు కావడం విశేషం. వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా పనిచేసిన సంగతి తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందగా, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి సెగ్మెంట్లో విజేతగా నిలిచారు.

## లోక్ అదాలత్ ను సద్వినియోగ పరుచుకోండి

**ఈ నెల 9 నుండి 14 వరకు లోక్ అదాలత్**
**వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కే రామకృష్ణ**

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధి వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వారికి మీరు గాని లేక మీకు తెలిసిన వారు డ్రంకెన్ డ్రైవ్ లో గాని, డ్రైవింగ్ లైసెన్స్ కేసు గాని, మైనర్ డ్రైవింగ్ కేసులలో మీ యొక్క వాహనం సీజ్ చేయబడితే ఈ నెల 9 నుండి 14 వరకు వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టులో లోక్ అదాలత్ ఉంది కావున మీ పై కానీ, మీకు తెలిసిన వాళ్ల పై గాని ఏమైనా కేసులు ఉంటే, మీరు కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేయ బడును. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు, వారి ఆధార్ కార్డ్ జిరాక్స్, వెహికల్ డాకుమెంట్స్. డ్రైవింగ్ లైసెన్సు కేసులు ఉన్నవారు, ఆధార్ కార్డ్ మరియు మీ సేవ లో లైసెన్సు కొరకు దరఖాస్తు చేసుకున్న రశీదు తీసుకుని రావాలి, మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించిన కేసులు ఉన్నవారు, బర్త్ సర్టిఫికెట్, లేక పదవ తరగతి మెమో మొదలైనవి తీసుకుని రావాలి. ఈ లోక్ దాలత్ లో త్వరితగతిన కేసును క్లోజ్ చేసుకోవచ్చు, కాబట్టి ఈ అవకాశాన్ని కేసు ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోగలరని వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

# సంపాదకీయం

## ఎన్నికలబాట పట్టిన బంగ్లాదేశ్



బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ అధినేత మహ్మద్ యూనస్ ఎట్టకేలకు సాధారణ ఎన్నికల నిర్వహణకు ముందుకు రావడం ముదావహం. ఇదిగో అదిగో అంటూ దిక్కుమాలిన సాకులు చూపి, ఎన్నికల నిర్వహణను నెలల తరబడి వాయిదా వేస్తూ వచ్చిన యూనస్ చివరకు అటు ప్రజాస్వామ్యవాదులు, ఇటు సైన్యం ఒత్తిడికి తలవంచక తప్పలేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ ప్రథమార్థంలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహిస్తామంటూనే గతంలో ఎన్నికలు పక్షపాతపూరితంగా జరిగాయని గత ప్రభుత్వాధినేత షేక్ హసీనాపై అక్కసు వెళ్లగక్కారు. బంగ్లాదేశ్ ప్రస్తుత సంక్షోభానికి గతంలో జరిగిన పక్షపాతపూరిత ఎన్నికలే కారణమని, తన ప్రభుత్వం మాత్రం స్వేచ్ఛాయుత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. తన తప్పిదాలు కప్పిపుచ్చుకునేందుకు వైరి పక్షంపై నిందలు మోపుతున్న యూనస్, ఎన్నికల నిర్వహణకు 20 నెలల సుదీర్ఘ సమయం దేనికి తీసుకుంటున్నారన్న ప్రశ్నకు ఏం సమాధానం చెబుతారు? ఎటువంటి పాలనానుభవం లేని ఈ పెద్దమనిషికి కుటిల రాజకీయ పరిజ్ఞానం మాత్రం పుష్కలంగానే ఉన్నట్లు గత పదినెలల ఆయన పాలన చెప్పకనే చెబుతోంది. వెల్లువెత్తిన ప్రజానిరసనల ధాటికి తట్టుకోలేక గత ఏడాది జూన్‌లో అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచి పరారై ఇండియాకు వచ్చి తలదాచుకున్న అనంతరం బంగ్లాదేశ్‌లో పరిస్థితులు (%జశీఅసఱఱశీఅం ఱఅ దీఖఅస్త్రశ్రీఖఁవంస్త్ర%) ఇకనైనా చక్కబడతాయనుకున్న ప్రజాస్వామ్యవాదుల ఆశలను యూనస్ అడియాసలు చేశారనడంలో సందేహం లేదు. హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో బంగ్లా ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దానికితోడు హసీనాతో తనకున్న పాత వైరాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆమెకు ఆశ్రయం కల్పించిందన్న అక్కసుతో ఇండియాతో తెగతెంపులు చేసుకోవడానికి కూడా సిద్ధపడటం ఆయన దుందుడుకు వైఖరికి నిదర్శనం. స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణలో కీలకపాత్ర పోషించిన అవామీలీగ్ పార్టీది ఏడున్నర దశాబ్దాల ఘన చరిత్ర. షేక్ హసీనాతో వ్యక్తిగత విభేదాల కారణంగా దేశ తాత్కాలిక సారథి యూనస్ ఆ పార్టీపై ఇటీవల ఉగ్రవాద నిరోధక చట్టం కింద నిషేధం విధించడం ప్రజాస్వామికవాదులను ఆశ్చర్యానికి గురిచేసింది. బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో అవామీలీగ్ నేతలపై నడుస్తున్న కేసుల విచారణ పూర్తయ్యేవరకూ నిషేధం కొనసాగుతుందని యూనస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో అవామీలీగ్ పోటీ చేసే అవకాశాలు అడుగంటినట్లే. ఎందుకంటే, అప్పటివరకూ విచారణ పూర్తికాకుండా యూనస్ ప్రభుత్వం చేయవలసినదంతా చేస్తుంది. షేక్ హసీనాపై బనాయించిన వందకు పైగా కేసులు ఒక కొలిక్కి రావడానికి ఏళ్లూపూళ్లూ పడుతుందన్న సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. గత ఏడాది ఆగస్టు 8న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా పదవీబాధ్యతలు చేపట్టిన యూనస్, అవామీలీగ్ నియంతృత్వ విధానాలనుంచి దేశానికి విముక్తి కల్పించి, దేశాన్ని ప్రజాస్వామిక పంథాలో నడిపిస్తానని శపథం చేశారు. కానీ పదవి చేపట్టి పదినెలలు దాటినా ఇప్పటికీ పాలనపై పట్టు సాధించలేదు సరికదా శాంతిభద్రతల పరిస్థితి సైతం నానాటికీ తీసికట్టు నాగంభొట్లు అన్న చందంగా మారింది. ఆయన పాలనలో విదేశాంగ విధానామూ కప్పదాట్లు తొక్కుతోంది. ఇప్పటివరకూ బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఇండియాతో స్నేహపూర్వక సంబంధాలనే కోరుకోగా, అందుకు భిన్నంగా యూనస్ కోరి కయ్యానికి కాలుదువ్వుతున్నారు. ఇండియా సహకారమే లేకపోతే బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ప్రపంచపటంలో స్థానం సంపాదించుకుని ఉండేది కాదన్న ఇంగితం మరచిన బంగ్లా ప్రభుత్వ తాత్కాలిక అధినేత, చైనా, పాకిస్తాన్‌లకు దగ్గరయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు విస్తుగొలుపుతున్నాయి. అవామీలీగ్‌పై నిషేధం ఉన్న కారణంగా రాబోయే ఎన్నికల్లో పోటీ ప్రధానంగా మాజీ ప్రధాని ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి), కొత్తగా ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ, జమాత్ ఏ ఇస్లామీల మధ్యే ఉంటుంది. బంగ్లాదేశ్‌లో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిఎన్‌పి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇండియాతో దౌత్య, వాణిజ్య బంధాలు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ, తాజాగా ఆ పార్టీ ఇండియాతో స్నేహసంబంధాలను కోరుకుంటున్నామని ప్రకటించడం ఆహ్వానించదగిన పరిణామం. ఇది ఇండియాకు కూడా కలసివచ్చేదే. ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వం చైనా, పాకిస్తాన్‌లతో అంటకాగేందుకు ఉవ్విళ్లూరుతున్న నేపథ్యంలో బిఎన్‌పికి పరోక్షంగా మద్దతు ప్రకటించడం ఇండియాకు అత్యంత ఆవశ్యకం.

## వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని 13 డివిజన్లకు చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు పంపిణీ

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

అంబేద్కర్ భవన్ లో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు చేతుల మీదుగా సోమవారం ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు జిడబ్ల్యూఎంసి అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహానగరపాలక సంస్థ 13 డివిజన్ల పరిధిలోని 750 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు పంపిణీ చేయనున్నారని, ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, నగర మేయర్, కమిషనర్ హౌసింగ్ శాఖ పిడి తదితర అధికారులు పాల్గొనట్లు జిడబ్ల్యుఎంసి అధికారులు ప్రకటనలో వెల్లడించారు.

# గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల పట్ల అవగాహన పెంచుకుందాం

**మన ఊరు మన బడిని విజయవంతం చేద్దాం**

**మహబూబాబాద్ జిల్లా(నెల్లికుదురు) జై భీమ్ న్యూస్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల ఆసక్తి క్రమంగా తగ్గిపోతుండటం ఆందోళనకరం. ఈ నేపథ్యంలో, పలు గ్రామాలలో విద్యార్థుల సంఖ్యలో భారీగా పడిపోవడం వల్ల కొన్ని పాఠశాలలు మూత పడడం, మరికొన్ని మూతపడే పరిస్థితికి చేరుకోవడం బాధాకరం అని సోషల్ జస్టిస్ పార్టీ తెలంగాణ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ వరిపల్లి అనిల్ కుమార్ గారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల పునరుజ్జీవనానికి ప్రతి గ్రామస్థాయి నాయకులు, రాజకీయ ప్రముఖులు, యువజన సంఘాలు, కుల సంఘాలు మరియు పూర్వ విద్యార్థులు అందరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. మన ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మన ఊరు - మన బడి కార్యక్రమం కేవలం ఒక పాలసీ మాత్రమే కాదు, అది గ్రామాల విద్యా సంస్కృతిలో మార్పు తీసుకురావడానికి ఒక ఉద్యమంగా మారాలి. ప్రతి గ్రామస్థాయి ప్రజలు రోజుకు ఒక గంట సమయం కేటాయించి, ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడంలో గ్రామస్థాయిలో ప్రజలందరూ సహకారం అవసరం తప్పనిసరి. ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే అందరికీ సమానమైన, నాణ్యమైన విద్య లభిస్తుంది. దేశంలో ఉన్న అనేక గొప్ప రాజకీయ నాయకులు మరియు అధికారులు ప్రభుత్వ బడుల్లోనే చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారు %-% ఈ సత్యాన్ని మరువకూడదు. అందుకే, ప్రభుత్వ పాఠశాలల పట్ల మళ్లీ విశ్వాసం కల్పించడానికి, మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని ప్రజలు కలసి విజయవంతం చేయడానికి అందరూ ముందుకు రావాలని వరిపల్లి అనిల్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.



## తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు

**హకీంపేట్ -కరీంనగర్ అదిలాబాద్**

**2025 -26వ సంవత్సరానికి గాను నాలుగో తరగతి ప్రవేశానికి విద్యార్థినీ విద్యార్థుల ఎంపిక**

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలలో 2025 -26 విద్యా సంవత్సరానికి గాను నాలుగోవ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థిని విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించడమైనది మూడు అంచెల్లో ఎంపిక ప్రక్రియ హకీంపేట్, కరీంనగర్, అదిలాబాదులో ఉన్న క్రీడా పాఠశాలలకు మూడు అంచెల్లో ఎంపిక విధానం ఉంటుంది. 16 జూన్ నుండి 19 జూన్ వరకు మండల స్థాయి ఎంపిక, మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థిని విద్యార్థులు జిల్లా స్థాయిలో 23 జూన్ నుండి 26 జూన్ వరకు అందులో ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో జూలై 1 నుండి జులై 5వరకు ఎంపిక జరుగుతుంది. హకీంపేటలో బాలురులకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు కరీంనగర్ లో బాలురులకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు. అదేవిధంగా అదిలాబాదులో బాలురకు 20 సీట్లు బాలికలకు 20 సీట్లు మొత్తం 120 సీట్లకు ఈ ఎంపిక జరుగుతుంది. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్స్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 800 మీటర్ల రన్, 6 ఐ 10 మీటర్ల షటిల్ రన్ మెడిసిన్ బాల్ త్రో వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, ఎత్తు, బరువుమొత్తం తొమ్మిది విభాగాల్లో 27 మార్కులకు గాను ఫిజికల్ పరీక్షలు నిర్వహిస్తారు. వయసు దృవీకరణ పోస్టర్ బోన్ అబ్ నార్మలిటిస్ లో మెడికల్ పరీక్షలు నిర్వహిస్తారు. 01-09-2016 నుండి 30-8- 2017 మధ్యన జన్మించి 8 నుండి 9 సంవత్సరాలు వయసు కలిగినవారు ఈ పోటీలకు అర్హులు. ఈ నెల 7 నుండి ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. విద్యార్థిని విద్యార్థులు తమ మొబైల్ నుండి కానీ, లేదా tgss.telangana.gov.inలో తమ వివరాలు నమోదు చేసుకోనవచ్చు. అదేవిధంగా ఈ ప్రవేశాలకు సంబంధించిన పూర్తి సమాచారం కొరకు ఒక ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను కూడా రూపొందించి విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉంచడం జరిగింది. మరింత సమాచారం కొరకు పరీక్షలు నిర్వహించే తేదీ ప్రదేశము, ఇతర వివారాలకు సంబంధిత జిల్లా క్రీడా, యువజన శాఖ అధికారులను సంప్రదించాలని ఒక ప్రకటనలో కోరారు. ఈ ఎంపిక ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఉండేవిధంగా అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు దక్కలేదు

**మాజీ జెడ్పిటిసి రామాసహాయం శ్రీనివాస్ రెడ్డి**


**ములుగు జిల్లా(తాడ్వాయి) జై భీమ్ న్యూస్**

ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అవకతవకలు జరిగాయని బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పిటిసి రామసాయం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం కటాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు ఇల్లు మంజూరు చేస్తామని చెప్పి నిరుపేదలకు ఇవ్వకుండా ఐదు నుంచి పది ఎకరాల భూమి ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేయడం దారుణమని వెంటనే అర్హులను గుర్తించి ఇవ్వాలని టీ న్యూస్ పై అక్రమ కేసులు బనాయించడం పత్రిక రంగంలో ఎవరికైనా సమానమేనని ఇలాంటి దుర్మార్గ చర్యలకు పూనుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.రాజీవ్ యువశక్తి ఎంపికలో కూడా అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేయాలని పార్టీ కార్యకర్తలను ఎంపిక చేయడం సరైన కాదాని అన్నారు.మేడారంలోని ఇసుక దందాను కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమంగా దోచుకుంటున్నారని ఇక్కడ తాసిల్దారుగా గిరిబాబు, మంజుల వచ్చి కొద్ది రోజులకే బదిలీ చేయించడం కాంగ్రెస్ పార్టీ నాయకులకు దక్కుతుందని అక్రమంగా సంపాదించుకోవడానికి ఓడికట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దిడ్డి మోహన్రావు, న్యూశెట్టి రమేష్, మాజి సర్పంచ్ గౌరమ్మ, జాజ చంద్రం సయ్యద్ హుస్సేన్,రంగు సత్యం,శ్రీకాంత్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థిని దారుణ హత్య

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**



అనంతపురం జిల్లా అనంతపురం నగరంలో మరోసారి రాక్షతత్వం కలవరపెట్టే ఘటన జరి గింది. ఇంటర్ సెకెండియర్ చదువుతున్న ఓ యువతి దారుణ హత్యకు గురైంది. గుర్తు తెలియని దుండగు లు విద్యార్థినిపై పెట్రోల్ పోసి నిప్పు పెట్టి హత్యచేశారు. ఈ ఘటన స్థానికులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ అమానవీయ సంఘటన అనంతపురం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మణిపాల్ స్కూల్ వెనుక భాగంలో చోటు చేసుకుంది. అక్కడ ఓ విద్యార్థినీ కాలిపోయిన మృతదేహన్ని స్థానికులు గుర్తించారు.. మంగళవారం నుండి తమ కుమార్తె కనిపించట్లేదని ఆమె తల్లిదండ్రులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, పోలీసులు స్పందించలేదని బాధితుల కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోలీసులు పట్టించుకొని ఉంటే మా అమ్మాయి మాకు దక్కేది అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ హత్యపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, విద్యార్థినీకి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమా చారం. అనుమానితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి.

## అతివేగంతో కారు నడిపిన ఇద్దరు వ్యక్తుల దుర్మరణం





**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**

ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన ఘటన ఘట్‌కేసర్ ఠాణా పరిధిలో శనివారం జరిగింది. ఎస్సై శేఖర్ వివరాల ప్రకారం.. హయత్‌నగర్ మండలం కుంట్లూరుకు చెందిన బత్తుల భార్గవ్ యాదవ్(25) సైనిక్‌పురికి చెందిన వర్షిత్(24) పాత అల్వాల్‌కు చెందిన ప్రవీణ్, హయత్‌నగర్‌కు చెందిన దినేష్‌లు నెలన్నర క్రితం మాదాపూర్‌లోని ఐటీ సంస్థలో చేరారు. శని, ఆదివారం సెలవు కావడంతో ఘట్‌కేసర్ మండలం మాదారంలోని విహారి ఫామ్‌హౌస్‌ను బుక్ చేసుకున్నారు. రెండు కార్లలో ఎనిమిది మంది శుక్రవారం రాత్రి విందు చేసుకున్నారు. మధ్యరాత్రి 2గంటల ప్రాంతంలో ప్రవీణ్‌కు చెందిన కారులో భార్గవ్ యాదవ్, వర్షిత్, ప్రవీణ్, దినేష్‌లు.. మరో కారులో నలుగురు ఎదులాబాద్ చెరువు కట్టపైకి వచ్చారు. అక్కడ కొద్ది సమయం గడిపిన తర్వాత 3గంటల ప్రాంతంలో తిరిగి ఫామ్‌హౌస్‌కు బయలుదేరారు. 3:10గంటలకు మాదారం వద్దకు రాగానే కారు నడుపుతున్న ప్రవీణ్ అతివేగంగా రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టి అక్కడి నుంచి వంద మీటర్ల దూరంలోని మరో స్తంభాన్ని ఢీకొట్టాడు. కారు ముందు ఉన్న ఎయిర్ బెలూన్ తెరుచుకుంది. కారు నడుపుతున్న ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. పక్కనున్న దినేష్‌కు గాయాలు కాలేదు. వెనుక కూర్చున్న వారి వద్ద బెలూన్ తెరుచుకోకపోవడంతో భార్గవ్‌యాదవ్, వర్షిత్‌లు రోడ్డుపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. వారి వెనుక వస్తున్న స్నేహితులు పోలీసు కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# భూమి పేదలదే కార్మికుడే రాజు అనే నినాదాలను ప్రాక్టికల్ గా చూపించిన నాయకుడు భగవాన్ దాస్

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి





**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

బి.ఆర్. భగవాన్ దాస్ జయంతి సందర్భంగా హనుమకొండలోని అశోక జంక్షన్ వద్ద ఉన్న బి.ఆర్ భగవాన్ దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య, భగవాన్ దాస్ కుటుంబ సభ్యులు. అనంతరం ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ... గొప్ప కమ్యూనిస్టు నాయకుడు, ట్రేడ్ యూనియన్ ఉద్యమ కారుడు బి.ఆర్. భగవాన్ దాస్ జయంతిని ఘనంగా జరుపుకుంటున్నాం. భగవాన్ దాస్ స్వతహాగా ప్రజల సమస్యల పట్ల గాఢమైన చైతన్యం కలిగిన నాయకులు. ఆయన ఉద్యమ జీవితం ఒక ప్రజాస్వామ్యపరమైన ఆశయం కోసం సాగిన నడక. వత్తులు, ఎల్ఐసి, బ్యాంకింగ్ రంగాల కార్మికులకు మద్దతుగా ఆయన పోరాటాలు చేసిన విధానం అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచిందన్నారు. భగవాన్ దాస్ ట్రేడ్ యూనియన్ ఉద్యమాల్లో తలమానికంగా నిలిచారని ,కార్మికుల కనీస వేతనాలు, భద్రతా నిబంధనలు, సేవా హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు అనేక కార్మికుల జీవన ప్రమాణాలను మార్చాయని తెలిపారు. ఆయన ఉద్యమాల్లో ప్రజల సమస్యల పట్ల స్పష్టత ఉండేదని. కమ్యూనిజం యొక్క నిజమైన అర్థాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన నిరంతర కృషి చేశారు. భూమి పేదలదే, కార్మికుడే రాజు అనే నినాదాలను ప్రాక్టికల్ గా చూపించిన నాయకుడు భగవాన్ దాస్. ఆయన కుమారుడు బి.ఆర్. లెనిన్ కూడా పితామహుని మార్గంలో కొనసాగుతున్నారు. వామపక్ష ఆలోచనలతో జర్నలిజంలో, ప్రజాసేవలో చురుకుగా ఉన్నారన్నారు.భగవాన్ దాస్ జీవితమే ఓ పాఠశాల. ఆయన చూపిన మార్గం ఇప్పటికీ ప్రజల సమస్యలపై ఎలా స్పందించాలో తెలియజేస్తోంది అని అన్నారు. ఆయన సేవలను గుర్తించుకోవడం మాత్రమే కాదు, ఆ సేవల దిశగా మనం ముందుకు సాగడమే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, యువజన నాయకులు తోట పవన్, భగవాన్ దాస్ కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# కాళేశ్వరం కమిషన్ విచారణపై ఈటల సంచలన వ్యాఖ్యలు

కేసీఆర్‌ను కాపాడాల్సిన అవసరం తనకేంటని ప్రశ్న?
కేబినెట్ లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏమీ జరగదని వెల్లడి..
తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఈటల

**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**



బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకు లేదని బీజేపీ నేత, తెలంగాణ మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఈటల.. కేసీఆర్ ను రక్షించేందుకే వాస్తవాలను దాచిపెట్టారన్న ఆరోపణలపై మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినపుడు ఆర్థిక మంత్రిగా ఉన్నానని, ఆ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో తన పాత్రను కమిషన్ ముందు వెల్లడించినట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉప సంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగ్ను కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. త్వరలోనే అన్ని జీవోలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతామని చెప్పారు.

# అధిక దిగుబడికి వరినీ ముందుగా సాగు చేయాలి

సంధ్యారాణి అదనపు జిల్లాకలెక్టర్

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**

మామునూర్ కృషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ యాత్ర సందర్భంగా నర్సంపేట మండలంలోని ముద్దంపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొని వరి పంటను ముందుగా సాగు చేయడం వల్ల అధిక దిగుబడి, తెగుళ్లు మరియు చీడపీడల ప్రభావం తగ్గించవచ్చని రైతులకు సూచించారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. వ్యవసాయంతో పాటు పశుపోషణ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలలోనూ రైతులు దృష్టి పెట్టాలన్నారు. మెట్ట పంటల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డా. శ్రీధర్ ప్రభుత్వ పథకాలు, ఎండా బీడు భూముల్లో సాగు చేయదగిన పంటలు, నీరు తక్కువ ఉన్న భూమిల్లలో నీటి కుంటల ప్రాముఖ్యత, డ్రిప్, స్ప్రింక్లర్ సేద్యం ద్వారా నీటి సమర్థవంతమైన వినియోగం గురించి వివరించారు. అధిక నీటిని వినియోగించే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు ఎంచుకోవాలని సూచించారు. కృషీ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. రాజు వికసిత్ కృషి సంకల్ప్ యాత్ర యొక్క ముఖ్య లక్ష్యాలు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతుల అమలు, కేంద్ర ప్రాయోజిత పథకాల ప్రయోజనాలపై రైతులకు అవగాహన కలిగించారు. జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ ఖరీఫ్ సీజన్లో అనుసరించవలసిన యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడి రకాల వివరాలతో పాటు, శాస్వత సాగు కోసం రైతులు వ్యవస్థాత్మకంగా ప్రణాళిక చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమం రైతుల్లో శాస్త్రీయ అవగాహనను పెంపొందిస్తూ, సమగ్ర వ్యవసాయ విధానాల అమలుకు మార్గం వేసింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. వెంకన్న, డా. వీరన్న, అసిటెంట్ డైరెక్ట్ ఆఫ్ అగ్రికల్చర్ నర్సంపేట డా. దామోదర రెడ్డి, వ్యవసాయ అధికారి కృష్ణ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# నరేంద్ర మోడీ నరమేధాన్ని ఆపాలి

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
కొండ బానేష్ సిపిఐ జిల్లా సమితి సభ్యులు

**మంచిర్యాల జిల్లా జై భీమ్ న్యూస్**




తాండూరు మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపి వేయాలి 2026 మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఫాసిస్టు చర్యల్లో భాగమేనని ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటివరకు 540 మందిని చట్ట విరుద్ధంగా హత్య చేశారని ఆపరేషన్ కగార్ మూలంగా మృతుల్లో ఆదివాసీలు ఎక్కువగా ఉన్నారని అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అక్కడి ప్రజలు భయానక స్థితిలో జీవనం కొనసాగించాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడ్డాయని ప్రాథమిక హక్కులు కోల్పోతున్నారని తక్షణమే న్యాయ విచారణ చేపట్టాలని ఈ చట్ట విరుద్ధ హత్యలను భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని మావోయిస్టులు కాల్పుల విరమణ ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కొనసాగించడం దుర్మార్గమని రాజ్యాంగ బద్ధంగా పరిపాలన చేయాలని ఆ ప్రజాస్వామిక పద్ధతుల్లో పాలన సాగుతుందని శత్రు దేశాలపై యుద్ధం చేసినట్లు మధ్య భారతంలో భారత పౌరులపై యుద్ధం చేయడం సరికాదని ఉగ్రవాద సంస్థలలో గత ప్రభుత్వాలు చర్యలు జరిపాయని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర ప్రజాస్వామ్య శక్తులు. ప్రజా సంఘాలు ప్రజలు చర్చలు చేయాలని కోరుతున్నారని. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయలేకపోవడం విచారకరమని శాంతి చర్చల కమిటీ 10 వామపక్ష పార్టీలు. లౌకిక శక్తుల ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలో వివిధ రూపాలలో సభలు. సమావేశాలు జరపాలని. ఈనెల 14న హైదరాబాదులో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టాలని. వీటన్నింటిని జయప్రదం చేయాలని మేధావులు బుద్ధి జీవులు పాల్గొనాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల ప్రహ్లాద్ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి మలిశెట్టి సత్యనారాయణ సిపిఐ తాండూర్ మండల సహాయ కార్యదర్శి ఇందారపు రాజేష్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కంబాల చందు, మీసాల సన్యాసి, గజ్జల వెంకన్న, చీకటి భీమేష్, శాలిగామ రాగులయ్య, కొండు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకథే నా ఆత్మకథ పుస్తకావిష్కరణ

పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్ రెడ్డి


**హైద్రాబాద్ జై భీమ్ న్యూస్**







కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించే వారు ప్రముఖ నాయకుడు బండారు దత్తాత్రేయ జీవనశైలిని చూసి ఎంతో నేర్చుకోవలసి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. బండారు దత్తాత్రేయ నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి ఎంతో స్ఫూర్తినిచ్చిందని గుర్తుచేశారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీనియర్ నాయకుడు, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ "ప్రజలకథే నా ఆత్మకథ" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్ గౌలిగూడ గల్లీ నుంచి హర్యానా గవర్నర్ వరకు సుదీర్ఘమైన ప్రయాణంలో దత్తాత్రేయ ఎన్నో ఒడిదుడుకులను అనుభవించారు. వారు ప్రజలతో సంబంధాలను ఏనాడూ కోల్పోలేదు. నాకు వారితో 40 సంవత్సరాల అనుబంధం ఉంది. దత్తాత్రేయ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దత్తాత్రేయని గౌరవించని నాయకులు తెలంగాణలో ఎవరూ లేరు. దత్తాత్రేయ స్ఫూర్తి మా ప్రభుత్వ నిర్ణయాల్లో ఉంటుంది. రాజకీయంగా భిన్న మార్గంలో ప్రయాణం చేస్తున్నప్పటికీ వ్యక్తిగత సంబంధాల విషయంలో దాచిపెట్టాలన్న ప్రయత్నం చేయడం లేదు. దత్తాత్రేయని చూసి ఎంతో నేర్చుకోవాలి. ప్రజలతో సంబంధాలు కలిగి ఉండటంలో దత్తాత్రేయ అజాతశత్రువు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్ పేయి జాతీయ రాజకీయాల్లో పదవుల్లో ఉన్నా లేకున్నా వారి గౌరవం ఎప్పుడూ తగ్గలేదు. అలాగే దత్తాత్రేయని కూడా అదే తీరుగా గౌరవిస్తారు. బీజేపీ నాయకుడిగా కన్నా దత్తాత్రేయని ఒక మర్యాద కలిగిన నాయకుడిగా అందరూ ఆయనను గౌరవిస్తారు. జంట నగరాల ప్రజలకు ఏ బాధ ఉన్న వినడానికి ఇద్దరు నాయకుల పేర్లు వినిపిస్తాయి. ఖైరతాబాద్ పి. జనార్ధన్ రెడ్డి, బండారు దత్తాత్రేయ. జంట నగరాల నాయకులు ఈ నేతలను గమనించాలి. దత్తాత్రేయతో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితోనూ సన్నిహిత సంబంధాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా కిషన్ రెడ్డిని అప్పుడప్పుడు ప్రశ్నిస్తూనే వారితో ఉన్న సాన్నిహిత్యంతో తెలంగాణను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మరెందరో ప్రముఖులు పాల్గొన్నారు.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEE,TV.COM